ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 22.0 కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

సోమవారం 1 డిసెంబరు 2025

పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్

- పునర్ వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత
- జీఓ విడుదల
- మార్పులకు అవకాశం



7

ఆటవిడుపు..!



అనంతపురం జిల్లా రెవెన్యూ జట్టు, శ్రీసత్య సాయి జిల్లా పోలీసు జట్ల మధ్య ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఆటవిడుపుగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. శ్రీసత్య సాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బ్యాటింగ్‌తో అలరించారు. బౌలింగ్‌లో ఏకంగా నాలుగు వికెట్లు కూల్చారు.

● వివరాలు 7లో..

బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఆన్‌లైన్‌లో ఆలయ సేవలు

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన అన్నిసేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఈఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గదులు, దర్శనాలు, అభిషేక పూజలు, ప్రసాదాల టోకెన్లు, తదితరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులకు ప్రత్యేక క్యూ ద్వారా దర్శనం కల్పిస్తామన్నారు. ప్రసాదాలు కూడా ప్రత్యేక కౌంటర్ ద్వారా అందజేస్తామన్నారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

-కదిరి (ఆంధ్రజ్యోతి)





విద్యుద్దీపాలంకరణలో నరసింహ స్వామి ఆలయం

బ్రహ్మోత్సవ శోభ

మడకశిర ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసంహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. దీంతో జంట ఆలయాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సోమవారం ధ్వజారోహణ, అగ్నిహోత్ర హోమం నిర్వహించనున్నారు. -మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి)

● చిరుజల్లులు



కొత్తచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. శనివారం జిల్లాలోని 9 మండలాలలో స్వల్పంగా వర్షం కురిసింది. నంబులపూలకుంట మండలంలో అత్యధికంగా 7.6 మి.మీ. వర్షపాతం నమోదయింది. అమడగూరు మండలంలో 5.4 మి.మీ, గాండ్లపెంట 2.6 మి.మీ, కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో 2.2 మి.మీ వర్షం కురిసింది. నల్లమాడ 1.6 మి.మీ, ఓడీసీ 1.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షం కురవలేదు. మబ్బులతో కూడిన మేఘాలు కమ్ముకోవడం, చలితీవ్రత పెరగడంతో చలికి జనం గజగజ వణికిపోతున్నారు.

నేడు పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారను. జిల్లా ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించాలని కలెక్టర్ సూచించారు.



ఉత్తుత్తి బడి..!

ఆరునెలల క్రితమే పాఠశాల మూత

- అయినా రోజూ విద్యార్థుల హాజరు నమోదు
- విచారణలో విస్తుపోయే విషయాలు

తలుపులలో మూతబడిన ఎస్ఎంఎంఎస్ పాఠశాల



అది ప్రైవేటు బడి.. మూతపడి నెలలు దాటింది. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి తెరుచుకోలేదు. టీచర్లు ఉండరు, నిర్వాహకులు కనిపించరు. విద్యార్థులు మాత్రం రోజూ హాజరవుతున్నారు మరి.. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది నిజంగా నిజం. అలాంటి ఉత్తుత్తు బడి తలుపులలో ఉంది. నెలల క్రితం మూతపడిన ఆ పాఠశాలకు రోజూ విద్యార్థులు వస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అధికారుల విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ విద్యార్థులు.. కదిరిలోని ఓ అనధికార ప్రైవేటు హాస్టల్‌లో నవోదయ, సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నట్లు తేలింది.



కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపుతున్న ఎంఈఓ చెన్నక్రిష్ణ

కదిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అంటే విద్యార్థులు, టీచర్లు ఉంటారు. ప్రైవేటు పాఠశాల అయితే యాజమాన్య ప్రతినిధులు కూడా ఉంటారు. రోజూ అందరూ హాజరవుతారు. తలుపులలో మాత్రం ఉత్తుత్తి బడి నడుస్తోంది. అధికారులు మాత్రం రోజూ విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేస్తారు. పాఠశాల మాత్రం ఆరు నెలలుగా మూత వేసి ఉంది. అక్కడ విద్యార్థులు కనిపించరు. టీచర్లు, యాజమాన్య ప్రతినిధులు ఎవ్వరూ ఉండరు. అధికారులు తనిఖీలు కూడా చేయరు. ఏమీలేకున్నా, అన్నీ ఉన్నట్లు రికార్డులు సృష్టించి, విద్యార్థుల హాజరు నమోదు చేస్తున్నారు. అదే తలుపులలోని ఎస్ఎంఎంఎస్ పాఠశాల. ఒకప్పుడు మండలకేంద్రంలో ఇదొక్కటే ప్రైవేటు పాఠశాల (మిగతా 7లో..)

చీనీచెట్ల నరికివేత



నరికేసిన చీనీచెట్లను చూపుతున్న మహిళా రైతు చంద్రకళ

తాడిమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన మహిళా రైతు చంద్రకళ పొలంలో 59 చీనీచెట్లను గుర్తుతెలియని దుండగులు నరికేశారు. రైతు ఐదేళ్లుగా 110 చీనిచెట్లు సాగుచేస్తున్నారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 59 చెట్లను నరికేశారు. ఉదయం పొలం వద్దకెళ్లి చూసిన మహిళారైతు బోరున విలపించింది. తాడిమర్రి ఎస్ఐ సెలవులో ఉండడంతో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర మండలంలోని ఆదిరెడ్డిపాళ్యంలో గల బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శనివారం రాత్రి తనిఖీ చేశారు. రెండు, మూడు గంటలపాటు హాస్టల్‌లోనే ఉన్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. భోజన నాణ్యత పెంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలనీ, అందులో రాజీపడితే సహించేది లేదన్నారు. చిత్తశుద్ధితో బోధించాలన్నారు. గుణాత్మక విద్య అందించాలన్నారు. పేద విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కొనేందుకు ప్రాథమిక స్థాయి నుంచే సిద్ధం చేయాలన్నారు. అప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. విద్యార్థినులను హాస్టల్ సిబ్బంది ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదని ఘాటుగా హెచ్చరించారు. -మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి)

పులుల వేట..!

నేటి నుంచి జిల్లాలో వన్యప్రాణుల గణన

● అడవుల బాట పట్టనున్న సిబ్బంది

పుట్టపర్తి టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అడవుల్లో పులులు, చిరుతలు ఇతర వన్యప్రాణులు లెక్కింపునకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం నుంచి అటవీబాట పట్టనున్నారు. నాలుగేళ్లకో సారి వన్యప్రాణులను లెక్కించాల్సి ఉంది. ఆ మేరకు జిల్లా అటవీశాఖ సిబ్బంది సోమవారం నుంచి 8వ తేదీ వరకు జిల్లాలోని రిజర్వ్ ఫారెస్టులో అణువణువూ గాలించి వన్యప్రాణులను లెక్కించనున్నారు. పశువుల కాపరులు, అటవీ ప్రాంతాల సమీపంలో ప్రజల నుంచి కూడా సమాచారం సేకరిస్తారు. అటవీ ప్రాణులకు పొంచి ఉన్న ముప్పు గురించి తెలుసుకుంటారు. వన్యప్రాణుల శాస్త్రీయ నమోదు, సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలమనేరు వద్ద గల ఎలిఫెంట్ క్యాంపులో ఇటీవల అటవీ సిబ్బంది, అధికారులు శిక్షణ ఇచ్చారు.

పులులున్నాయా..?

జిల్లాలోని బుక్కపట్నం, కదిరి, పెనుకొండ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాల పరిధిలో 1.25 లక్షల చదరపు ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. వాటిలో పులులు, చిరుతలు ఎన్ని ఉన్నాయన్న కచ్చితమైన సమాచారం లేదు. మడకశిర, అగళి, రెడ్డిపల్లి, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో 10కిపైగా చిరుతలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల మడకశిర ప్రాంతంలో రెండు చిరుతలు చనిపోయినట్లు సమాచారం. పెద్దపులులు ఉన్నాయా, లేవా అన్నది అటవీ అధికారులు కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. ఈ దఫా వన్యప్రాణుల లెక్కింపులో ఆధునిక సాంకేతిక పరికరాలు, పద్ధతులు వినియోగించనున్నారు. తద్వారా కచ్చితమైన సమాచారం తెలుస్తుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

45 బృందాలతో లెక్కింపు

జిల్లాలోని మూడు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో 45 బీట్లు ఉన్నాయి. ఒక ఫారెస్ట్ బీట్‌కు ఒక బృందం చొప్పున 45 బృందాలతో వన్యప్రాణుల లెక్కింపు పకడ్బందీగా నిర్వహిస్తాం. మొదటి మూడు రోజులు మాంసాహార జంతువులను లెక్కిస్తాం. తర్వాత రెండు రోజులపాటు సేకరించిన సమాచారాన్ని సరిచూసుకుంటాం. డిసెంబరు 6 నుంచి శాకాహార జంతువులను లెక్కిస్తాం. ఈ సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో భద్రపరుస్తాం.

-చక్రపాణి, జిల్లా అటవీ అధికారి



నీళ్లలో చేలు..!

పంటను ముంచిన పీఏబీఆర్ బ్యాక్ వాటర్

- సర్వం నష్టపోతున్న అన్నదాతలు
- పరిహారం కూడా అందని దుస్థితి
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



నీట మునిగిన దానిమ్మపంట

లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. రకరకాల పంటు పెట్టారు. నెలలు, ఏళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. తీరా పంటలు చేతికొచ్చే సమయంలో నిండా మునిగాయి. పీఏబీఆర్ బ్యాక్ వాటర్ పొలాలను ముంచేసింది. కొన్ని పంటలు నీటిలో మునిగిపోగా.. మరికొన్ని తేలుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కలల పంటలు కళ్ల ముందే మునిగిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గుండెలు బాదుకుని రోదిస్తున్నారు.

కూడేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) బ్యాక్‌వాటర్ పంట పొలాలను ముంచేసింది. ఓ పక్క భూములకు పరిహారం అందక, మరోపక్క అప్పులు చేసి సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోవడంతో అన్నదాతలు సర్వం నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. 11.100 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పీఏబీఆర్ నిర్మాణం చేపట్టారు. మైలారంపల్లి, పెద్దకొకుంట్ల, కోనంపల్లి, బూదిగుమ్మ, అంకంపల్లి, రాకెట్ల, జయపురం, ఎంఎం హళ్లి, క్రొరకోడు తదితర గ్రామాల పరిధిలో 5,830 ఎకరాల సాగు భూమిని విడతల వారీగా సేకరించారు. డ్యాంకి లీకేజీలు ఏర్పడడంతో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేదు. ప్రస్తుతం నీటి నిల్వ 5 టీఎంసీలు దాటడంతో (మిగతా 7లో..)

నాట్‌వర్క్..!



మిద్దెలెక్కితేనే సెల్‌కు సిగ్నల్

నెట్‌వర్క్ సమస్యతో గ్రామీణుల ఇబ్బందులు



ఏబీ పల్లి తండాలో ఉలవల పంపిణీ రిజిస్ట్రేషన్‌కి నెట్‌వర్క్ సమస్యతో మిద్దె ఎక్కిన అధికారులు, రైతులు

ముదిగుబ్బ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సరిగాలేక జనం ఇబ్బందులు పడుతున్నారు. మిద్దెలెక్కితేనే నెట్‌వర్క్ గగనంగా మారింది. దీంతో ఫోన్ మాట్లాడాలన్నా.. రేషన్ బియ్యం వేయాలన్నా.. ప్రభుత్వ సర్వేలు చేయాలన్నా.. నెట్‌వర్క్ ఉన్నచోటుకి వెళ్లాల్సిందే. మండలంలోని కొండగట్టుపల్లి, మద్దన్నగారిపల్లి, తప్పెటవారిపల్లి, ఏబీ పల్లి, ఏబీపల్లి తండా, మండలకేంద్రంలోని కస్తూర్బా కాలనీ, పాతవూరు, చెలిమిబావి వీధుల్లో నెట్‌వర్క్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల గ్రామాల్లో సమస్యలు వర్ణనాతీతం. ప్రభుత్వ పథకాల కోసం ఓటీపీ, బయోమెట్రిక్, పథకాల రిజిస్ట్రేషన్ సమయంలో నెట్‌వర్క్ అందక రైతులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఆధార్ సెంటర్లలో నెట్‌వర్క్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల్లో నెట్‌వర్క్ తిప్పలు తప్పట్లేదు.



తప్పెటవారిపల్లిలో నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సచివాలయ సిబ్బంది

ఇబ్బందులు పడుతున్నాం



ఏబీపల్లి తండాలో సెల్‌ఫోన్ సిగ్నల్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముదిగుబ్బకి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా తండాలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా రావు. మిద్దెలు ఎక్కి నెట్‌వర్క్ అందినప్పుడే బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది. వృద్ధులు మిద్దెల మీదకు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.

-దేవుడు నాయక్, ఏబీపల్లి తండా

ఎన్నోసార్లు వినతులు ఇచ్చాం..



ఏబీపల్లి తండాలో నెట్‌వర్క్ సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు వినతులు ఇచ్చినా.. పరిష్కారం కాలేదు. ముదిగుబ్బకు కూతవేటు దూరంలో ఉన్న మా గ్రామంలోనూ సమస్య తీవ్రంగా ఉంది. దూరప్రాంతాల్లో చదువుతున్న పిల్లలతో మాట్లాడాలంటే ఏ సమయంలోనైనా మిద్దె ఎక్కాల్సిందే.

-కుళ్లాయప్ప నాయక్, ఏబీపల్లి తండా

క్రైం కార్నర్

పెళ్లయిన ఆరు నెలలకే..

● రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం


శ్రీధర్ మృతదేహం

సోమందేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివాహ బంధంలోకి అడుగిడిన ఆ యువకుడు.. కన్న కలలు తీరకుండానే కన్నుమూశాడు. తమ కొడుకుకు మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చిందని ఆశించిన తల్లిదండ్రుల కలలు చెదిరిపోయాయి. చేతికొచ్చిన కొడుకు విగత జీవుడు కావడంతో పుత్రశోకంతో తల్లడిల్లిపోయారు. కొడుకు, కోడలు ఇంట్లో కలియ తిరుగుతుంటే చూసిన క్షణాలు ఇంకా మరువక ముందే.. ఇక తమ బిడ్డలేడని జీర్ణించుకోలేకపోతున్నారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వెనుక శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో గాజుల శ్రీధర్(32) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన గాజుల శ్రీధర్ బెంగళూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆరునెలల క్రితం పుట్టపర్తికి చెందిన సాయివినితతో వివాహమయింది. శనివారం అర్ధరాత్రి బెంగళూరు నుంచి బయలుదేరి స్నేహితులతో కలిసి పుట్టపర్తికి వెళ్తుండగా కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అతను మరణించారు. కారులో స్నేహితులు నాగరాజు, వెంకటేశ్, చంద్ర ఉండగా.. నాగరాజు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పెనుకొండ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. గాజుల శ్రీధర్ మృతితో ఇరుకుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆసుపత్రివద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. భార్య సాయివినితను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఈ సంఘటన అందరినీ కలిచివేసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో ఇద్దరి మృతి


రామలక్ష్మమ్మ (ఫైల్)

ముదిగుబ్బ, నవంబరు, 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో ఇద్దరు మృతిచెందారు. ముదిగుబ్బ మండల పరిధిలోని రాళ్లఅనంతపురం క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈదులపల్లికి చెందిన మహిళ మృతి చెందారని ముదిగుబ్బ సీఐ శివరాముడు పేర్కొన్నారు. సీఐ వివరాల మేరకు.. ఈదులపల్లికి చెందిన రామలక్ష్మమ్మ(72) పెద్ద కుమారుడు ఓబులపతితో కలిసి తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో ధర్మవరం మండలం బిల్వంపల్లికి బయలుదేరింది. రాళ్ల అనంతపురం సమీపంలో ద్విచక్ర వాహనం రోడ్డు దాటుతుండగా కదిరి వైపు నుంచి అనంతపురం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో రామలక్ష్మమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు ఓబులపతికి తీవ్ర గాయాలు కావడంతో బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

చోళసముద్రంలో రైతు..


పర్వతయ్య (ఫైల్)

కూడేరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చోళసముద్రం గ్రామానికి చెందిన పర్వతయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెండున్నర ఎకరాల పొలంలో వేరుశనగ సాగు చేయడానికి అవసరమైన విత్తనాలను ఆమిద్యాల గ్రామంలో ఆదివారం పర్వతయ్య కొనుగోలు చేశాడు. విత్తనాలను ఆటోలో చోళసముద్రం గ్రామానికి తరలిస్తుండగా.. కొర్రకోడు గ్రామం దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఆటోలో కూర్చున్న పర్వతయ్యను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేటు వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు తిమ్మరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బంజారాల హక్కుల కోసం పోరాడుదాం

● ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రే నాయక్


అభివాదం చేస్తున్న ఏఐబీఎస్ఎస్ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంజారాల హక్కుల సాధనతోపాటు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్(ఏఐబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చక్రే నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏఐబీఎస్ఎస్ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభ నిర్వహించారు. అంతకుముందు పీటీసీ నుంచి క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేడ్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సభలో చక్రేనాయక్ మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలవుతున్నా బంజారాల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. ఇప్పటికే రోడ్లు, నీరు, బస్సు, సెల్‌టవర్, వైద్యసేవలు అందని తండాలు ఉన్నాయని తెలిపారు.

కమిటీ ఎన్నిక: సమావేశంలో భాగంగా ఏఐబీఎస్ఎస్ అనంతపురం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రవీంద్రనాయక్, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాములు నాయక్, కోశాధికారిగా నారాయణనాయక్, గౌరవ సలహాదారులుగా అశ్వర్థనాయక్, బా లా నాయక్, ఠాగూర్ నాయక్, బాబూ నాయక్, కోఆర్డినేటర్‌గా రంగ్లా నాయక్, ఉపాధ్యక్షులుగా గోపాల్ నాయక్, అశోక్ నాయక్, సూ ర్య నాయక్, తారాచంద్రనాయక్, నాగరాజు, రవినాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రసాద్ నాయక్, తిరుపాల్ నాయక్‌ను ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా శివమ్మబాయి, ప్రధాన కార్యదర్శిగా పద్మాబాయి, సహాయ కార్యదర్శిగా కాంతమ్మబాయి, ప్రచార కార్యదర్శిగా బన్సీలాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడిగా అంజనేయులు నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటనాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పరమేష్ నాయక్‌తో కలిపి మొత్తం 55 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర నాయకుల సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది.

నీళ్లలో చేలు..!

(5వ పేజీ తరువాయి)


నీటితో నిండిన వరి పంటను చూపుతున్న మహిళా రైతు వెంకటలక్ష్మి

బ్యాక్‌వాటర్ పరిహారం చెల్లించని భూముల్లో పంటలను ముంచెత్తుతోంది. ఇప్పటికే వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఆయా భూముల్లో సాగుచేసిన దానిమ్మ, గుమ్మడి, టమోటా, కంది, ఆముదం, వరి, చీనీ, వేరుశనగ తదితర పంటలు నీటిలో మునిగిపోయాయి. దీంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో పరిహారం చెల్లిస్తామంటూ చెప్పిన పాలకులు.. నివేదికలు తీసుకుని మొండిచేయి చూపారు. దీంతో రైతులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. పరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరుతున్నారు.

3,026 ఎకరాల సేకరణకు నివేదికలు

పీఏబీఆర్‌కు సేకరించని భూమిలోకి బ్యాక్‌వాటర్ చేరుతోంది. దీంతో సమస్యను రైతులు.. నీటి పారుదల శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరింత భూమి సేకరించాలని నిర్ణయించారు. 2024లో 3,026 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అందుకు రూ.405 కోట్లు పరిహారం చెల్లించాలని డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీరు రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతోంది. కుడికాలువ గేటు తెరుచుకోలేదు. దీంతో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక నీటి నిల్వ ఐదు టీఎంసీలు దాటిపోయింది. దీంతో బ్యాక్‌వాటర్ వందల ఎకరాల్లో భూములను ముంచెత్తింది.

డ్యాం నీటిలో దానిమ్మ చెట్లు



జయపురం గ్రామ సమీపంలో ఐదెకరాలు కౌలుకు తీసుకుని, లక్షలు ఖర్చుచేసి దానిమ్మ సాగు చేస్తున్నాం. ప్రస్తుతం చెట్లు పూత దశలో ఉన్నాయి. పీఏబీఆర్ బ్యాక్ వాటర్ పొలంలోకి చేరింది. నేల తడిబారిపోయి పూత రాలిపోతోంది. రూ.4 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి పంట సాగుచేస్తే పూర్తిగా నష్టపోతున్నా. పంటకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావట్లేదు.

-రామాంజనేయులు, కౌలు రైతు, కడదరకుంట గ్రామం

నీటిలోనే వేరుశనగ, వరి పంటలు



2.50 ఎకరాల్లో అప్పులు చేసి బోరు వేయగా.. నీరు పడింది. ఈ ఏడాది ఎకరాలో టమోటా, ఎకరాన్నరలో వేరుశనగ, వరి పంటలు పెట్టాం. రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టాం. వరి కోత దశకు చేరింది. పొలాన్ని నీరు ముంచెత్తింది. తిండిగింజల కోసం నాటుకున్న వరి నీటిలో మునగగా.. టమోటా కుళ్లిపోయింది. వేరుశగన పూర్తిగా మునిగిపోయింది.

- వెంకటలక్ష్మి, మహిళారైతు, జయపురం

టమోటా పైరు మునిగింది



మూడెకరాల్లో టమోటా సాగుచేశారు. రూ.లక్ష అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టా. ప్రస్తుతం కాయ దశలో ఉంది. పీఏబీఆర్‌లో నీరు ఎక్కువగా నిల్వ చేయడంతో బ్యాక్ వాటర్ టమోటా పంటను ముంచేసింది. బోరులో వేసిన మోటారు, పంటకు వేసిన డ్రిప్ సామగ్రి మునిగిపోయాయి. మోటారు బయటకు తెచ్చుకునేందుకు కూడా అవకాశం లేదు.

-సాకే నారాయణ, రైతు, జయపురం గ్రామం

ఆ పోలీసులకు మళ్లీ అవకాశం...!

● నాడు గళం విప్పిన ప్రకాష్‌పై జగన్ ప్రభుత్వం వేటు
● నేడు రిపోర్ట్ చేసుకోవాలన్న ఎస్పీ జగదీష్
● మరో ముగ్గురు కానిస్టేబుళ్లకూ అవకాశం

అనంతపురం క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పోలీసులకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పిన ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. గత ప్రభుత్వంలో ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్ పోలీసుల బకాయిల విడుదలలో అన్యాయం జరుగుతోందంటూ గళం విప్పారు. దీంతో అప్పటి ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టింది. ఆయనను విధుల నుంచి తొలగించింది. 'సీఎం జగన్ సర్... సేవ్ ఏపీ పోలీస్' పేరుతో మూడేళ్ల కిందట పోలీసు అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. పోలీసులకు అరియర్లు ఇవ్వాలని కోరారు. ఇది నచ్చని అప్పటి జగన్ ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టింది. ఆయనను విధుల నుంచి తొలగించింది. అప్పటి నుంచి ఆయన పోరాటం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన ప్రభుత్వానికి పిటీషన్ పెట్టుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలంటూ డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయనను విధుల్లోకి తీసుకునేలా శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ప్రకాష్ ఎస్పీ వద్ద రిపోర్ట్ చేసుకోనున్నారు.

మరో ముగ్గురుకి అవకాశం...

పలు ఆరోపణలతో సర్వీస్ నుంచి డిస్మిస్ అయిన మరో ముగ్గురు పోలీసులకు మళ్లీ అవకాశం కల్పించారు. సర్వీస్ నుంచి తొలగించిన వారికి మళ్లీ ప్రభుత్వ ఆదేశాలతో అవకాశం కల్పించారు. పోలీస్ కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, నాగరాజు, ఎన్‌వీ రమణ సర్వీసును రీ-ఇన్‌స్టేటెడ్ చేస్తూ... ఎస్పీ జగదీష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వారికి పోస్టింగ్ కూడా ఇచ్చారు.

కవులు.. చైతన్య వారధులుగా నిలవాలి

● ఎస్కేయూ రిటైర్డ్ వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ సమాజ చైతన్యం కోసం కవులు వారధులుగా నిలవాలని ఎస్కేయూ విశ్రాంత వీసీ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, డల్లాస్ ఏరియా రాయలసీమ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన రాయలసీమ మహా కవిసమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాయలసీమ నేల చారిత్రక, సాంస్కృతిక నెలవైనదని, భావితరాలకు ఆ వారసత్వ స్ఫూర్తిని కవులు సమాజానికి అందించాలని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన దాదాపు 180 మంది కవులు తమ కవితాగానం వినిపించారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, రచయితలు శాంతినారాయణ, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి, విశ్రాంత ఆచార్యులు లక్ష్మీనారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, మానవతా అమర్నాథరెడ్డి, రైతుసంఘం శ్రీనివాసరెడ్డి, సీమ ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అనంత జట్లు అదుర్స్


విజేత అనంత బాలుర జట్టుకు షీల్డ్ అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరంరూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా జట్లు అదరగొట్టాయి. అనంత బాలికలు అండర్-14, అండర్-19 రెండు విభాగాల్లోనూ చాంపియన్లుగా అవతరించారు. అనంత బాలురు అండర్-14లో విజేతలుగా నిలిచారు. అండర్-19లో చిత్తూరు జట్టు చాంపియన్‌గా అవతరించింది. మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో మూడురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి అనంత జట్లు తిరుగులేని ఆధిపత్యం చెలాయించాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. విజేత జట్లకు షీల్డ్‌లు, పతకాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 600 మంది క్రీడాకారులకు పరిటాల రవీంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో టీషర్టులను పరిటాల శ్రీరామ్ అందజేశారు. విజేత జట్లకు చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ముందుకు వెళితే విజయం సాధించవచ్చన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, ఏపీ సీడాప్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి మహేష్‌చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు మేకల రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ఆటవిడుపు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల ఆటవిడుపు ఆసక్తిగా మారింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం అనంతపురం రెవెన్యూ టీం, పుట్టపర్తి జిల్లా పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో అనంతపురం కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాటామంతి కలిపారు. అనంతరం టాస్ వేసి, మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పుట్టపర్తి పోలీసు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. నాగేంద్రప్రసాద్ (31), ప్రభాకర్ (20), ఎస్పీ సతీష్‌కుమార్ (8బంతుల్లో 12), డీఎస్పీ మహేష్ (17) రాణించారు. అనంతపురం బౌలర్ ఓబులేసు 4వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 17.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. రవితేజ (17), కలెక్టర్ ఆనంద్ (12బంతుల్లో 9) రాణించారు. శ్రీసత్యసాయి ఎస్పీ సతీష్‌కుమార్ 4 వికెట్లు, వీరూ నాయక్, శివ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా పోలీసు జట్టు 35 పరుగుల తేడాతో విజయం సాధించింది.

మత సామరస్యానికి ప్రతీక బాబయ్య దర్గా

● రేపు గంధంపూజ
● సర్వమత సమ్మేళనానికి హాజరుకానున్న ప్రముఖులు


బాబయ్యస్వామి దర్గా ముఖద్వారం

పెనుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ బాబయ్యస్వామి దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హిందూ ముస్లిం ఐక్యతకు చిహ్నం. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ దర్గాలలో ఇదొకటి. పెనుకొండ పట్టణంలో వెలసిన ఈ దర్గాలో ప్రతి సంవత్సరం ఉరుసు నిర్వహిస్తారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. స్వామివారి 753వ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ప్రధానమైన గంధం పూజ మహోత్సవం ఈనెల 2న నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా, మాజీ పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. 3న దీపారాధన, 4న ఫకీర్ల ప్రదర్శన, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. గంధం పూజ నిర్వహించే రోజు రాత్రి 9 గంటల నుంచి సర్వమత సమ్మేళనం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తరుఫున బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చేతులమీదుగా చాదర్ సమర్పిస్తారని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూక్, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు షరీఫ్ మహ్మద్ అహ్మద్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, ఏపీరాష్ట్ర ముతువల్లిల సంక్షేమ సంఘం అధ్యక్షులు షకీల్ షఫీ, కలెక్టర్ శ్యామ్ సుందర్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు హాజరవుతారని వివరించారు.

టెట్ నుంచి మినహాయించాలి

● యూటీఎఫ్ నాయకుల డిమాండ్


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని యూటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలోపు టెట్ అర్హత సాధించాలని, అలా కానిపక్షంలో వారిని సర్వీసు నుంచి తొలగించాలని విద్యాహక్కు చట్టంలోని క్లాజ్ 2(1) ప్రకారం సుప్రీంకోర్టు సెప్టెంబరు 1న తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ తీర్పు వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం టెట్ పరీక్షను 2011 నుంచి తప్పనిసరి చేశారని అన్నారు. అప్పటి నుంచి టీచర్ వృత్తిని పొందడానికి అభ్యర్థులు టెట్ పరీక్షల్లో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా నియమితులవుతున్నారని తెలిపారు. 2011 కంటే ముందు నియమితులై 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా వర్తింపచేసేలా తీర్పు రావడం అందరినీ మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తోందన్నారు. దీనిపై యూటీఎఫ్ పోరాటాలకు సిద్ధమవుతోందని తెలిపారు. డిసెంబరు 9,10తేదీల్లో డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు, 18న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, జనవరి 4న భీమవరంలో వేలాదిమంది ఉపాధ్యాయులతో భారీ ర్యాలీ, జనవరి 29న చలో పార్లమెంటు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, చంద్రశేఖర్, సురేశ్, సాయిగణేశ్, వెంకటకిశోర్, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తుత్తి బడి..!

(5వ పేజీ తరువాయి) ఉండేది. యాజమాన్యం మారడం, విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఆరునెలలుగా మూత వేశారు. అయినా.. 32 మంది విద్యార్థులు చదువుతున్నట్లు రికార్డులు చూపుతున్నారు. ఆ విద్యార్థులంతా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నవోదయ, సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు.

అనుమతులు లేకుండా హాస్టల్..

కదిరిలోని కేఎల్ఎన్ పాఠశాలలో అనధికారికంగా హాస్టల్ నిర్వహిస్తూ, కోచింగ్ ఇస్తున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు.. ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి రావడంతో వెంటనే విచారణ చేయాల్సిందిగా మండల విద్యాధికారి (ఎంఈఓ) చెన్నక్రిష్ణను ఆదేశించారు. ఈనెల 26న ఆయన పాఠశాల తనిఖీకి వెళ్లగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు ఏకంగా తలుపుల మండలకేంద్రంలోని ఎస్ఎంఎంఎస్‌లో చదువుకుంటున్నట్లు అడ్మిషన్లు చేశారు. విషయాన్ని స్వయంగా కేఎస్ఎన్ పాఠశాల ప్రతినిధి.. ఎంఈఓ ముందు వెల్లడించారు. ఆరు నెలలుగా మూతబడిన పాఠశాలలో ఎలా చదువుకుంటున్నారో అర్థం కాని విషయం. తలుపులలో ఎస్ఎంఎంఎస్ పాఠశాల గురించి వివరాలు సేకరిస్తే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే మూతబడినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని తలుపుల ఎంఈఓ వెంకటరాముడు ధృవీకరించారు. మూతపడిన పాఠశాలకు రోజూ 32 మంది హాజరవుతున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు.

స్వస్థలాలకు విద్యార్థులు

కేఎల్ఎన్ పాఠశాలలో అనధికారికంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌ను ఎంఈఓ చెన్నక్రిష్ణ మూత వేయించారు. అక్కడున్న విద్యార్థులను బస్సుల్లో ఇళ్లకు పంపించారు. అనుమతిలేకుండా కోచింగ్ సెంటర్ నడుపుతున్న కేఎల్ఎన్ పాఠశాల నిర్వాహకుడు రమేష్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓకి నివేదికలు పంపుతున్నట్లు చెప్పారు. ఉత్తుత్తి బడిని సృష్టించిన నిర్వాహకులు, పర్యవేక్షించని మండల విద్యాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

విచారించి, చర్యలు తీసుకుంటాం: కిష్టప్ప, జిల్లా విద్యాశాఖాధికారి

పాఠశాల మూతపడినట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి, చర్యలు తీసుకుంటాం.

పంచాయతీల విభజనకు గ్రీన్‌సిగ్నల్

● పునర్ వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత
● జీఓ విడుదల
● మార్పులకు అవకాశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల విభజన, మార్పులు, చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకు ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తూ.. గురువారం జీఓ ఎంఎస్ నెంబర్ 97 జారీ చేసింది. దీంతో పంచాయతీల్లో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని స్థానిక అధికారులు తయారుచేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించే అవకాశం ఉంది. పునర్వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేయడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దీని ద్వారా మార్పులకు అవకాశం కలుగుతోంది. పలు పంచాయతీల నుంచి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. నిషేధం కారణంగా పెండింగ్‌లో ఉన్నవాటిని విభజించే అవకాశం ఉంది. దీంతో పాటు స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా, అధికారులు ప్రతిపాదనలు పంపి మార్పులు చేర్పులు చేసుకొనే వెసులుబాటు ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఏ చిన్న పనికయినా పంచాయతీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీ కేంద్రాలకు చుట్టేసుకుని 30 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అభివృద్ధికి సంబంధించి తగిన విధంగా నిధులు కేటాయింపు లేక కొన్ని మజరా గ్రామాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. దీంతో అవకాశం ఉన్న వాటిని పంచాయతీలుగా చేయడం ద్వారా స్థానిక ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. పంచాయతీలకు కేటాయించే నిధుల ద్వారా అభివృద్ధికి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తమ పంచాయతీలను విభజించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిషేధం ఎత్తివేయడం ద్వారా మరిన్ని ప్రాంతాల నుంచి విభజన, కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడానికి సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొన్నింటిని పరిశీలిలిస్తే..

● అనంతపురం రూరల్ మండలంలో ఉన్న ఐదు పంచాయతీలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో నారాయణపురం, రాజీవ్‌కాలనీ, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేటతో పాటు అనంతపురం రూరల్ గ్రామ పంచాయతీని మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కార్పొరేషన్‌లో విలీనం కావడం ద్వారా అభివృద్ధికి పెద్ద పీట వేసే అవకాశం ఉంది.

● బెళుగుప్ప మండల కేంద్రం నుంచి బెళుగుప్ప తండాను వేరు చేసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

● నార్పల మండలం కేసేపల్లి పంచాయతీలో కూరగానపల్లిని ప్రత్యేక పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు పంపించారు.

● పామిడి మండలం వంకరాజుకాలువ పంచాయతీలో నేమలపల్లి గ్రామం ఉంది. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా నేమలపల్లిని ప్రత్యేక పంచాయతీ చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి.

● తలుపుల మండలం వేపమానిపేట పంచాయతీలో ఉన్న గంజివారిపల్లిని విభజించి.. నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ద్వారా ఇప్పటికే జిల్లా అధికారులకు విన్నవించారు.

● కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి పంచాయతీ పరిధిలోని మీటే నాయక్ తండా, బోడేనాయక్ తండా, రాందాస్ నాయక్ తండాలను కలిపి ప్రత్యేక పంచాయతీ చేయాలన్న ప్రతిపాదన ఉంది.

జీఓ విడుదలతో మార్గం సుగుమం

పరిపాలనా సౌలభ్యం, గ్రామీణ ప్రజల అవసరాల దృష్ట్యా అవసరమైన పంచాయతీలను విభజన చేయడానికి అవకాశం ఏర్పడింది. ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. మరికొన్ని కలెక్టర్ల వద్దనే ఉండిపోయాయి. నిషేధం ఎత్తివేత కారణంగా వీటన్నింటికి జీవం పోసినట్లయింది. ప్రభుత్వం దృష్టిలో ఉన్న వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకొనే వెసులుబాటు కల్పించారు. ప్రధానంగా తలుపుల మండలంలోని వేపమానిపేట పంచాయతీకి వెళ్లాలంటే.. గంజివారిపల్లి పరిసర ప్రాంతాల వారు దాదాపు 28 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు పార్టీలకు అతీతంగా అధికారులకు, ఇటు పాలకులకు వినతులు ఇచ్చారు. అదే తరహాలో ఎర్రదొడ్డికి సంబంధించి తండాలన్నింటిని కలిపి ఒక పంచాయితీగా చేయడం ద్వారా ఆయా తండాల అభివృద్ధికి దోహదపడే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాల ప్రజలు ప్రత్యేక పంచాయతీలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అందుకు అనుగుణంగా స్థానిక నాయకులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన నిషేధం ఎత్తివేత వెసులుబాటును సద్వినియోగం చేసుకొని న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యేల పర్యటన

అమడగూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కోసం సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మహమ్మదాబాద్, కసముద్రం, అమడగూరు, చిన్నగాని పల్లి, చీకిరేవులపల్లి పంచాయతీలలో పర్యటించి వికలాంగులు, వృద్ధులకు పింఛన్‌లు అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

● నంబులపూలకుంట: మండలపరిధిలోని గోవిందురాజులపల్లిలో సోమవారం పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నరసింహులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ దండేరవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పింఛన్లు పంపిణీ చేస్తోందన్నారు. ఇదే గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను, ధనియాన్‌చెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

కంటి శస్త్ర చికిత్సలకు 33 మంది ఎంపిక

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 33 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌బాబు, నాగేంద్ర తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గోసే రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు గోసే రాధాకృష్ణ, వారి కుటుంబసభ్యులు కంటి ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. 55 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా అందులో 33 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశామన్నారు. లయన్స్ క్లబ్ కోశాధికారి వెంకటేశ్‌కుమార్, జోనల్ చైర్మన్ వేణుగోపాలాచార్యులు, క్లబ్ ప్రతినిధులు మోహన్‌రావు, పల్లెం వేణుగోపాల్, వెంకటస్వామి, పార్థసారధి పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని నేత్రాలయ ఐ క్లినిక్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పేదలకు ప్రతి ఆదివారం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ మధు తెలిపారు. కంటి శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని ఆయన తెలిపారు.

జానపద గాయనికి పురస్కారం


అవార్డు అందుకుంటున్న సోమిశెట్టి సరళ

ధర్మవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జానపద గాయని సోమిశెట్టి సరళకు జయసింధూర్ బెస్ట్ సింగర్ అవార్డు అందుకుంది. ఆదివారం మదనపల్లిలోని శ్రీదేవి గార్డెన్స్‌లో జరిగిన వేడుకల్లో జయసింధూర్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 35 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కళాకారులు, రచయితలు, గాయకులు ప్రతిభను గుర్తిస్తూ పురస్కారాలు అందించారు. ధర్మవరానికి చెందిన జానపద గాయని సోమిశెట్టి సరళ కోడిబాయే లచ్చమ్మ పాటను పాడి అందరిని ఆకట్టుకుంది. ఆమెకు ప్రముఖ గాయకులు శ్రీరాములు చేతులమీదుగా ఉత్తమ గాయని పురస్కారం అందజేశారు.

తోడ్పాటు అందించండి

● వ్యవసాయ మంత్రిని కోరిన మార్కెట్‌యార్డ్ చైర్మన్


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న పూల శివ

కొత్తచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి కేంద్రబిందువుగా ఉన్న కొత్తచెరువు మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించినట్లు మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూలశివప్రసాద్ తెలిపారు. మంత్రిని ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. కొత్తచెరువు వ్యవసాయమార్కెట్‌యార్డ్ అభివృద్ధికి నిదులు కేటాయించాలని, ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తే వాటి ద్వారా అద్దెల రూపంలో ఆదాయం వస్తుందన్నారు. దీంతో వ్యవసాయ మార్కెట్‌యార్డ్ అభివృద్ధిబాటలో నడుస్తుందని ఆయన అచ్చెన్నాయుడుకు విన్నవించామన్నారు. ప్రస్తుతం ప్రతిబుధవారం మేకలు, గొర్రెల సంత జరుగుతోందని, తద్వారా వచ్చిన ఆదాయంతో అరకొర అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు. కావున మీరు తోడ్పాటును అందిస్తే కొత్తచెరువు మార్కెట్‌యార్డ్‌ను జిల్లాలోనే ఉత్తమ మార్కెట్‌యార్డ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రికి వివరించినట్లు ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మార్కెట్‌యార్డ్‌చైర్మన్‌తో పాటు జనసేన పార్టీ నాయకులు ముత్యాల కరుణాకర్, నాగభూషణ తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌పై కేసు

కదిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వీఆర్‌ఓ ఇనయతుల్లా విధులకు ఆటకం కలిగించారని, పుట్టపర్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ప్రేమనాథ్‌రెడ్డిపై కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ఆదివారం తెలిపారుర. కదిరి పట్టణంలో ఉంటున్న ప్రేమనాథ్‌రెడ్డి ఈనెల 27న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసుకుంటున్న తన విధులకు ఆటకం కలిగించారని కదిరి పట్టణ, సైదాపురం వీఆర్‌ఓ డీఎస్ ఇనయతుల్లా ఈనెల 29న శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని సైదాపురం గ్రామం సర్వేనంబర్ 36లో 73సెంట్లు గ్రామ కంఠం స్థలం ఉంది. ఆ స్థలాన్ని పరంబోకు స్థలంగా రాసి, తనకు ఇవ్వాలని ప్రేమనాథ్‌రెడ్డి వీఆర్‌ఓను బెదిరించారు. ముందుగా తాను వెంట తెచ్చుకున్న పత్రాల మీద వీఆర్‌ఓతో బలవంతంగా సంతకాలు పెట్టించుకుని, సీలు వేయించుకున్నారని, ఈ విషయం ఎక్కడైనా చెబితే ఇబ్బంది పడతావని బెదిరించాడని వీఆర్‌ఓ ఇనయతుల్లా స్థానిక తహసీల్దార్ మురళీక్రిష్ణ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ సూచన మేరకు వీఆర్‌ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ప్రేమనాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించలేదని ఆమె భర్త వడిత్యగణేశ్‌నాయక్ ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని శారదనగర్‌కు చెందిన వడిత్య గణేశ్‌నాయక్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఏడేళ్ల క్రితం బుక్కపట్నం మండలం రాశింపల్లికి చెందిన సంధ్యాబాయితో వివాహమైంది. వారికి సంతానంలేదు. ఈ విషయంలో భార్య, భర్త మధ్య మనస్పర్థలు ఉండేవి. ఈ క్రమంలో ఈ నెల 27న ఉదయం పనిమీద వెళ్లిన వడిత్య గణేశ్‌నాయక్ మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి ఆమె ఇంట్లో కనిపించలేదు. బంధువులు, తెలిసినవాళ్ల వద్ద వెతికినా ఆమె కనిపించలేదు. దీంతో అతడు ఆదివారం తన భార్య సంధ్యాబాయి కనిపించలేదని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వడిత్య గణేశ్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.

మూలన పడ్డ స్వచ్ఛ వాహనాలు

● పట్టించుకోని పాలకులు, అధికారులు



మలమీదపల్లి పంచాయతీలో తుప్పుపడుతున్న స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సంకల్పం వాహనాలు

గాండ్లపెంట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పలు పంచాయతీల్లో స్వచ్ఛ సంకల్పం సైకిళ్లు తుప్పు పడుతున్నాయి. అయినా అధికారులు, పాలకులు పట్టించు కోవడం లేదు. మండలంలోని 14 పంచాయతీలలో ప్రతి పంచాయతీకి స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సంకల్పం అనే ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. పలు పంచాయతీల్లో వాటి ని వినియోగించడం అంతంత మాత్రంగానే ఉండటంతో మూలన పడివేశారు. వాటికి ఏర్పడిన చిన్నపాటి మరమ్మతులను కూడా చేయించకపోవడంతో తుప్పు పడుతున్నాయని ప్రజలు అంటున్నారు. మండలంలో ఎన్ని వాడకంలో ఉన్నాయనే విషయం కూడా పర్యవేక్షణ అధికారులు మరిచిపోయారనే విమర్శలు వినవస్తున్నాయి. ఆయా పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు కూడా వాటి మరమ్మతుల కోసం కనీసం రూ.100 ఖర్చు చేసిన దాఖలాలు లేవని అంటున్నారు. గ్రామాలలో నిత్యం చెత్తను సేకరించేందుకు ఉపయోగించాల్సిన స్వచ్ఛ సంకల్పం ట్రైసైకిళ్లను పలుచోట్ల పంచాయతీ కార్యాలయాల ఎదుటే వదిలేయడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. దీనిని చూసిన ప్రతి ఒక్కరూ ఇలా ప్రజాధనం ఎంత వృధా అవుతోందో అంటూ విమర్శలు చేస్తున్నారు.. అధికారులు ఇప్పటికైనా స్పందించి చిన్న చిన్న మరమ్మతులు చేయించి మూలన పడేసిన స్వచ్ఛ సంకల్పం సైకిళ్లను వినియోగం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ ఎప్పుడో..?

● మండలానికి ప్రభుత్వం 400క్వింటాళ్లు సరఫరా

● రబీ సాగుకు అదును దాటి పోతున్నా పంపిణీ చేయలేదంటున్న రైతులు



ధర్మవరం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ వచ్చే సింది. సాగుకు వేళ అయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రభుత్వం ప్ర త్యామ్నాయ విత్తసాగు కోసం విత్తన ఉలవలను రాయితీతో మండలాని సరఫరా చేసింది. ఈ వర్షాలకు విత్తనాలను విత్తేందుకు రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాలను ఇప్పటివరకు ఒకటి రెండు గ్రామాల్లో మినహా ఏ గ్రామంలోనూ పంపిణీ చేయలేదు. ప్రభుత్వం మండలానికి 400 క్వింటాళ్ల ఉలవ విత్తనాలను కేటాయించి సరఫరా చేసినట్లు వ్యవసాయాధికారి తెలిపారు. వాటిని ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాలకు తరలించారు. ఇప్పటివరకు వాటిని రైతులకు పంపిణీ చేయలేదు. రబీసాగు అదునుదాటిపోతుండడంతో రైతులు పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకుని సాగుచేసుకుంటున్నారు. రైతులు రైతు సేవాకేంద్రాలకు వెళ్లి అడిగితే సిబ్బంది రైతన్నా మీకోసం కార్యక్రమం సాకుచూపుతున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని కూడా నిర్వహించలేదని అయినా విత్తనాలు పంపిణీ చేయ కుండా రైతుసేవాకేంద్ర సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేస్తే మీరెందుకు ఇంకా ఇవ్వరు అంటూ పలు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బందిని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రబీసాగు అదును దాటిపోతుండడంతో... విత్తనాలు ఇంకెప్పుడు పంపిణీ చేస్తారని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల వ్యవసాయాధికారులు స్పందించి ప్రత్యామాయ సాగు కోసం ఉలవ విత్తనాలు పంపిణీ చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అందరికీ పంపిణీ చేస్తాం

రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు కోసం ప్రభుత్వం ఉలవల విత్తనాలను సరఫరా చేసింది. వాటిని రైతులకు పంపీణీ చేయాలని ఇప్పటికే ఆయా రైతుసేవాకేంద్రాల సిబ్బందికి తెలియజేశాం. రబీలో సాగు చేసే రైతులకు మాత్రమే విత్తనాలను సరఫరా చేస్తాం. ఇప్పటికే మండలంలోని కొన్ని పంచాయతీలలో పంపీణీ చేశాం. మిగతా పంచాయతీలలో కూడా పంపిణీ చేస్తాం. - ముస్తఫా, ఏఓ, ధర్మవరం

అర్హులకు ఇంటి పట్టాలివ్వాలి: సీపీఐ


మాజీ మంత్రి పల్లెకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ మండల శాఖ అధ్యక్షుడు చలపతినాయుడు కోరారు. ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని పుట్టపర్తిలో కలిసి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ఇనగలూరు పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 380/2, 1.80 సెంట్ ఆ స్థలంలో ఐదు సంవత్సరాలుగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరికి మూడు సెంట్లు చెప్పున స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని మాజీ మంత్రి పల్లెకు సమర్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, రత్నబాయ్, సుధాకర్, వెంకటరమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల చెల్లింపునకు రోడ్డు మ్యాప్ ప్రకటించాలి: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు రఘునాథరెడ్డి

కదిరి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థిక బకాయిల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మ్యాప్ ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా 79వ వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలల కాలం పూర్తి అయినప్పటికి ఏ ఒక్క సమస్యపైన స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. గత ఆరేళ్లుగా విద్యారంగం, పాఠశాల విద్యాశాఖ ప్రయోగాలకు నెలవుగా మారిందన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా మంచి జరుగుతుందని ఆశించామన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశంపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. వివిధ కారణాలతో మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేమయ్య యాదవ్, ఎస్టీయూ నాయకులు రామ్మోహన్, ప్రసాద్, గాపాల్ నాయక్, జయకృష్ణ, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ కార్యకర్త మృతి

ముదిగుబ్బ, నవంబరు, 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దన్నగారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త శివయ్య అనారోగ్య సమస్యతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ మద్దన్నగారిపల్లి నాయకుడు చినగాని నరసింహయాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. టీడీపీ స్థానిక నాయకులు చినగాని కృష్ణయ్య, సూర్యప్రకాష్ సిద్ధయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

3న చలో విజయవాడ

● అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు


యాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గాండ్లపెంట, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలంటూ ఈనెల 3వ తేదీన చలో విజయవాడ (అగ్రిగోల్డ్ బాధి తుల ఆవేదన యాత్ర) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ బాధి తుల సంఘం మండల కార్యదర్శి షమీవుల్లా ఆదివారం తెలిపారు. ఆయన ఆదివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అగ్రిగోల్డ్ కంపెనీ చేతిలో మోసపోయి, చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. దాదాపు 11 సంవత్సరాలు అయిందన్నారు. అయితే సుదీర్ఘ పోరాటాల వలన రూ.10వేలు నుంచి రూ. 20వేలు మాత్రమే చెల్లింపులు జరిగాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ ఆస్తులన్నీ అమ్మి డిపాజిట్ దారులకు సొమ్ము చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈనెల 3న అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల ఆవేదన యాత్ర, దీక్షలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. బాధితులు చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని తమ న్యాయ పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల నియోజకవర్గ అధ్యక్షుడు హాజీ అత్తార్ మహబూబ్‌భాషా, ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఉప కార్యదర్శి కరీ మున్నీసా, నాగభూషణ, మన్సూర్, సమ్మద్, బీబీజాన్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్ష


ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో భయాన్ని పొగొట్టేందుకే ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్షను నిర్వహించినట్టు పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్షను ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్డి విఠల్, జయచంద్రారెడ్డి సహకారంతో నిర్వహించారు. ఈ పరీక్షలో బీఎస్‌ఆర్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, కొత్తపేట రైల్వే బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, శాంతినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, శివానగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌కు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉమాపతి, రాంప్రసాద్, మేరివరకుమార్, బిల్లే భాస్కరయ్య, రాజేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నారాయణస్వామి, విశ్వనాథ్, మురళీకృష్ణ, రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని రహదారి సమస్య

● రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే..: గ్రామస్థులు


రస్తాకు ముళ్లకంపలు అడ్డంగా వేసిన దృశ్యం

తాడిమర్రి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చిల్లకొండయ్యపల్లిలో పది రోజులుగా రహదారి సమస్య నెలకొన్న విషయం తెలిసిందే. తన పొలంలో నుంచి రహదారి లేదంటూ రైతు చంద్రకళ పాత దారికి అడ్డుగా ముళ్ల కంప వేయించింది. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని అప్పటికప్పుడు ముళ్ల కంప తీయించి ఆమెకు ఎలాంటి హామీ ఇవ్వకుండా తిరిగి వచ్చేశారు. అయితే అదే రోజు సాయంత్రం తిరిగి రహదారికి అడ్డుగా కంపవేశారు. అయితే జిల్లా సర్వేయర్ కొలతలకు వస్తున్నారంటూ రహదారికి ముళ్ల కంపలు అడ్డుగా వేయడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు శనివారం మహిళా రైతు చంద్రకళకు నోటీసులు అందజేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా సర్వేయర్ అక్కడికి వస్తారని, కొలతలు వేసి దారి నిర్ధారిస్తారని నోటీసులో పేర్కొన్నారు. అదేరోజు రాత్రికే గ్రామంలో చీనీ చెట్లను నరికివేశారు. రస్తావివాదం ప్రారంభం నుంచి రెవెన్యూ సిబ్బంది సరైన రీతిలో స్పందించకపోవడం మూలంగానే చిల్లకొండయ్యపల్లిలో తిరిగి అల్లర్లు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో ఏమి జరిగినా అందుకు రెవెన్యూ సిబ్బంది పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

శివుడికి నాగాభరణం సమర్పణ

ఓబుళదేవరచెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి సన్నిధానం ఆవరణంలోని శివాలయానికి ఏబీవీపీ నాయకుడు వాసుదేవ పంచలోహ నాగాభరణం అందజేశారు. దానిని ఆయన ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలుచేసి ఆ నాగాభరణంతో అలంకరించినట్లు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు తెలిపారు. అయ్యప్ప సన్నిధానంలో ఆదివారం ఓడీచెరువు యువసైన్యం సహకారంతో 495 మంది మాలధారులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన



వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ కదిరి పట్టణంలోని వాహనాల యజమానులకు, డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐపై మాట్లాడుతూ... రహదారి సూచనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. అలాగే వాహనాలను ఎలా కండీషన్‌లో పెట్టుకుంటామో అలాగే మన ఆరోగ్యాన్ని కాపాడుకో వాలన్నారు. ఇందులో భాగంగానే కదిరి పట్టణంలోని రోటరీ క్లబ్ వారి సహకారంతో విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి వారు వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ డీఎస్‌ఎం వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ మదన్‌కుమార్, కిషోర్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, నామా రాఘవా, రాఘవ, రాజశేఖర్‌రెడ్డి, మట్ట రాజీవ్, మహేష్‌రెడ్డి, విజన్ ప్లస్ కంటి ఆస్పత్రి సిబ్బంది మాధవరెడ్డి, జవహర్ బాషా, స్థానిక లారీ, ఆటో, ఎల్‌జీవీ అసోసియేషన్ సభ్యులు సుమారు 200 మంది దాకా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి

● ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ రెడ్డి

కదిరి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమష్టిగా కృషి చేద్దామని ప్రైవేటు పాఠశాలల సంఘం కదరి డివిజన్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక షిర్డీ సాయి హైస్కూల్‌లో ఆదివారం ఆ సంఘం మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారెడ్డి, కదిరి డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి, అనంతపురం జిల్లా సీఆర్‌వో కోటిరెడ్డి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లి పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం ఇటీవల డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డులు తీసుకున్న అనిల్‌కుమార్‌రెడ్డి, రవిచంద్రారెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిగీత, కృష్ణమూర్తి, జాహ్నవి బాష, విశ్వేశ్వరరెడ్డి, సలీం బాష, శంకర్‌రెడ్డి, అలీమ్ బాష తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలిసిన హెం జేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లీశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం, పూలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

రైతు, చేనేత సమస్యలపై వినతి

● కర్ణాటక ఎమ్మెల్యేని కలిసిన కాంగ్రెస్ ధర్మవరం నాయకులు

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రైతు, చేనేతల సమస్యలపై కర్ణాటక ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకులు అజయ్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ విన్నవించారు. ఆదివారం ధర్మవరానికి వచ్చిన కర్ణాటక ఎమ్మెల్యేతో పాటు ఏపీసీసీ పరిశీలకులు తులసిరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, జిల్లా అధ్యక్షుడు ఇనయ్‌తుల్లాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మవరం పరిస్థితులు, రైతు, చేనేత సమస్యలను వారికి వివరించారు. పార్టీ బలోపేతానికి ఆచరిస్తున్న విధానాలను, పార్టీ అనుబంధ సంఘాల ఏర్పాటు గురించి వివరించారు. స్పందించిన ఆయన త్వరలో నూతన కార్యవర్గాలు ఏర్పాటుచేస్తామని వారు భరోసా ఇచ్చారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చాలి

● కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆందోళన

కదిరి అర్బన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి షానవాజ్‌ను మార్చాలంటూ ఆ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆదివారం కదిరికి వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర పరిశీలకులు అజయ్ సింగ్ కారును అడ్డుకొని ఆందోళన చేశారు. షానవాజ్ చేస్తున్న ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం జరుగుతోందన్నారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను ఎవరికీ చెప్పకుండా నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన వ్యవహరిస్తున్న తీరుతో పార్టీ కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పీఎస్ అహ్మద్ హుస్సేన్, చిలమత్తూరు మోహన్ గాంధీ, బాలకృష్ణ యాదవ్, అఫ్రాష్, ఇందదుల్లా ఖాన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుజాత

ధర్మవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు పట్టణంలోని జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెడ్‌మిసెస్ సిస్టర్ సుజాత తెలిపారు. కదిరిలోని టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబరులో నిర్వహించిన సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన జ్ఞాపిక, రేతు, ప్రియ దీప్తి ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు సోమ, మంగళవారాల్లో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో సత్యసాయిజిల్లా జట్టు తరపున పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల హెడ్‌మిస్ తో పాటు కరస్పాండెంట్ సిస్టర్ రిన్సీ, ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. సుప్రభాతసేవతో మొదలై కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం ని ర్వహించారు. సిద్ధేశ్వరస్వామికి, దొడ్డేశ్వరస్వామికి, మల్లీశ్వరస్వామికి, విరూపాక్షి స్వామిని ప్రత్యేకంగా వెండి కవచం, పూలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

కాళికాంబకు..



రొళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నగిరిలో వెలిసిన కాళికాంబ కమటేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు సూర్యప్రకాశ్ అమ్మవారికి ప్రత్యేకం అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



కేక్ కట్‌చేస్తున్న ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్

హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవర్చుకోవచ్చని ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ అన్నారు. ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. విధేయత సత్ప్రవర్తనతో మెలగవచ్చన్నారు. అన్నింటికి మించి దేశభక్తి భావాలు పెరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి ఇందులోచేరాలన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాల్లో కూడా ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఫణీంద్ర, కోఆర్డినేటర్లు రాజన్న, వైస్ ప్రిన్సిపాల్ అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

నేడు మంత్రి సవిత రాక

రొద్దం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదికకు మంత్రి సవిత రానున్నట్లు తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

మాల మహానాడు

తాలూకా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



అధ్యక్షుడిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

మడకశిరటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు తాలూకా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. తాలూకా అధ్యక్షుడిగా జి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా జయరామప్ప, కార్యదర్శిగా సోమకుమార్, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఎంపిక చేస్తామన్నారు.

అగళి ఎస్ఐగా శోభారాణి



అగళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అగళి నూతన ఎస్ఐగా శోభారాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుమన్ అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎస్ఐను సిబ్బంది, మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సుధాకర్



సోమందేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తనను ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సుధాకర్ తెలిపారు. కదిరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోరంట్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిచెరువుపల్లి గ్రామానికి చెందిన ఉప్పర అనిల్(19) కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఉప్పర ఈశ్వరప్ప మృతిచెందగా, కుమారుడు అనిల్ తల్లి నాగలక్ష్మమ్మ సంరక్షణలో ఉంటున్నారు. అనిల్ సోమందేపల్లిలోని మేనమామ కుమార్తెను ఇచ్చి వివాహం చేయాలని కోరారు. మేనమామ తన కుమార్తె మైనర్ అని, ఇంటర్ చదువుతుండడంతో, చదువు పూర్తి అయ్యాక పెళ్లి చేస్తానని చెప్పారు. ఆ మాటలు నచ్చని అనిల్ మనస్తాపానికి గురై రెడ్డిచెరువుపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో 24న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అట్టించుకున్నారు. గాయపడిన అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. తల్లి నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామచంద్ర తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు

- క్రమబద్ధీకరణకు చర్యలు శూన్యం
- 44వ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



కొడికొండ చెక్‌పోస్టు కూడలిలో అడ్డదిడ్డంగా దూసుకుపోతున్న వాహనాలు

చిలమత్తూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒక్క నిమిషం ఆగితే పోయేదేముంది... మన ప్రాణాలు సురక్షితంగా ఉండటం తప్ప..! ప్రమాదమని తెలిసినా రోడ్డు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవడం కొందరికి అలవాటైపోయింది. ఎదురుగా పెద్ద పెద్ద వాహనాలు వస్తున్నా తామేమీ తక్కువ తిన్నామా అంటూ మృత్యుశకటంలా ఎదురెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ఇందుకు నిదర్శనం మండలంలోని 44వ జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు కూడలి. ఈ కూడలిలో వాహనచోదకులు తమ భద్రతను గాలికి వదిలేసి అడ్డదిడ్డంగా రోడ్డును దాటుతున్నారు. అసలే 44వ జాతీయ రహదారి. ఈ రహదారిపై వచ్చే వాహనాల వేగం కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. కానీ చిన్న వాహనాలు, ద్విచక్రవాహనదారులు, బాటసారులు నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకుండా రోడ్డును దాటే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో పలు దఫాలు ఈ కూడలిలో ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు గాయపడ్డారు. ప్రధానంగా చిలమత్తూరు నుంచి బెంగళూరు వైపు వెళ్లే వారు, బెంగళూరు నుంచి హిందూపురం వైపు వెళ్లే వారు ఈ కూడలిలో తప్పులు చేస్తున్నారు. వేగంగా భారీ వాహనాలు దూసుకువస్తున్నా అదేమి పట్టించుకోకుండా రోడ్డుని దాటే ప్రయత్నం చేస్తున్నారు. అందులోనూ ఈ కూడలిలోనే బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో కూడలి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చిపడుతోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రద్దీ సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించాలి

ప్రధానంగా ఈ కూడలిలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో ప్రయాణికులు అటుఇటూ తిరగడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం వలన అనుకోకుండా సంఘటనలు జరుగుతుంటాయి. ఈ సమయంలో పోలీసులు ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించినట్లైతే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు చెబుతున్నారు. అదేవిధంగా బెంగళూరు వైపు నుంచి వచ్చే బస్సులు, అనంతపురం వైపు నుంచి వచ్చే బస్సులు ఈ కూడలిలోనే ఆపి ప్రయాణికులను భర్తీ చేసుకుంటున్నారు. దీని వలన బస్సుల కోసం దూరంగా ఉన్న వారు పరుగుతో వచ్చి బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వాహనాలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడి రోడ్డుపై కాకుండా సర్వీస్ రోడ్లో ఆపి ప్రయాణికులను భర్తీ చేసుకుంటే ప్రమాదాలను కొంత వరకు నివారించవచ్చు. ప్రయాణికులు కూడా ఏ వైపునకు ప్రయాణం చేయాలో ఆ వైపే బస్సు కోసం వేచి ఉంటారు. దాంతో ప్రయాణికులు బస్సుల కోసం అటు నుంచి ఇటు...ఇటు నుంచి అటు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటే ఎంతో మంది ప్రాణాలను కాపాడినట్లు అవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జయప్ప

గుడిబండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసీ గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2010-11విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల అభివృద్ధి దాత జయరాంరెడ్డి హాజరై మాట్లాడుతూ ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత పదవుల్లో ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు తీసుకురావాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తరగతి గదులు కలియతిరిగారు. అప్పట్లో చేసిన అల్లర్లు, చిలిపి పనులు నెమరవేసుకుని ఆనందంగా గడిపారు. ప్రిన్సిపాల్ జయప్ప, ఉపాధ్యాయులు, అప్పటి విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలలో 2007నుంచి 2010లో డిగ్రీ పూర్తీచేసిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 15ఏళ్ల తరువాత వారంతా ఒకేచోట కలిసి గతస్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి అధ్యాపకుల జ్ఞాపకాలు, వారు పడిన కష్టసుఖాలను స్నేహితులతో కలిసి పంచుకున్నారు. జ్ఞాపకాల పొదిరిల్లు అనే శీర్షికతో పుస్తకం తయారుచేసి ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ పుస్తకానికి రూపాన్ని ఇచ్చిన యువ కవి డాక్టర్ వడ్డి జగదీశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పరిటాల శ్రీరాములు చిత్రపటాన్ని కళాశాలకు బహూకరించారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులు ఓబులేసు, దేవిశెట్టి రామన్న, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, హరీష్‌బాబు, ప్రిన్సిపాల్ జయప్పలను సత్కరించారు.



అప్పటి టీచర్లతో పూర్వ విద్యార్థులు

రహదారి భద్రతపై అవగాహన

కదిరి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఆదివారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ కదిరి పట్టణంలోని వాహనాల యజమానులకు, డ్రైవర్లకు రహదా రి భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐపై మాట్లాడుతూ... రహదారి సూచనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. అలాగే వాహనాలను ఎలా కండీషన్‌లో పెట్టుకుంటామో అలాగే మన ఆరోగ్యాన్ని కాపాడుకో వాల న్నారు. ఇందులో భాగంగానే కదిరి పట్టణంలోని రోటరీ క్లబ్ వారి సహ కారంతో విజన్ ప్లస్ కంటి ఆసుపత్రి వారు వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ డీఎ్‌ఎం వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ మదన్‌కుమార్, కిషోర్ కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, నామా రాఘవా, రాఘవ, రాజశేఖర్‌రెడ్డి, మట్ట రాజీవ్, మహేష్‌రెడ్డి, విజన్ ప్లస్ కంటి ఆస్పత్రి సిబ్బంది మాధవరెడ్డి, జవహార్ బాషా, స్థానిక లారీ, ఆటో, ఎల్ జీవీ అసోసియేషన్ సభ్యులు సుమారు 200 మంది దాకా పాల్గొన్నారు.

సంతానం కలగలేదని వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హారేసముద్రం గ్రామానికి చెందిన దొడ్డయ్య (39) అనే వ్యక్తి సంతానం కలగలేదని జీవితంపై విరక్తిచెంది ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దొడ్డయ్యకు వివాహమై 14 ఏళ్లయ్యింది. ఇంత వరకు సంతనం కలగకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం ఇంటి అవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి భార్య లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టుబడిన ఆర్ఐకి రిమాండ్

హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన హిందూపురం మున్సిపల్ ఆర్ఐకు ఏసీబీ కోర్టు రిమాండు విధించినట్లు ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు ఖాళీ స్థలానికి ట్యాక్స్ తగ్గిస్తామని చెప్పి ముద్దిరెడ్డిపల్లికి చెందిన రవికుమార్ నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఆయన్ను ఆదివారం కర్నూలులోని ఏసీబీ కోర్టు న్యాయమూర్తివద్ద ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

- తుప్పుపడుతున్న పరికరాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



మల్లినమడుగులో నిరుపయోగంగా సంపద కేంద్రం

రొళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి ఎరువు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ క్షేత్రస్థాయిలో లక్ష్యం నీరుగారిపోతుంది. మండలంలోని మల్లినమడుగు, బీజీ హళ్లి పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. బీజీ హళ్లి పంచాయతీలో స్వచ్ఛ యంత్రాలు దెబ్బతిన్నాయి. చెత్త సంపద కేంద్రం ఉన్నా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. రసాయన ఎరువుల వాడకూడదని దృష్టిలో ఉంచుకుని చెత్త కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులకు వర్మీ కంపోస్ట్ ఎక్కడా దొరకడంలేదు. సంపద కేంద్రాలు ఉపయోగించి ఎరువులు తయారు చేయాలని ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.



బీజీ హళ్లిలో మూలనపడిన స్వచ్ఛ సంకల్ప వాహనాలు

ఆరుబయటే వంట..

- ఉడికీ ఉడకని అన్నం తినలేమంటున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



ఆరుబయటే వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

సోమందేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వంటగది ఉన్నా ఏజెన్సీ నిర్వాహకులు ఆరుబయటే కట్టెలపొయ్యిపై వంట చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 938మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని దక్కించుకున్నవారు పాఠశాల ఆవరణలో వంటగది ఉన్నా బయలు ప్రదేశంలో వంటపాత్రలు పెట్టి వండుతున్నారు. పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత, గ్రౌండ్ పక్కనే ఉండటంవల్ల గాలి, దూళి మధ్య ఆహార పదార్థాలు వండటంతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఉన్న వంటగది చిన్నగా ఉండటంతో టీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా పక్కనే నూతన భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అయినా దీనిని వినియోగించుకోకుండా తాళాలు వేసి ఉంచారు. గాలికి ఆహారం సరిగ్గా ఉడకక ముద్దగా మారుతోంది. ఇలా ఉడికీఉడకని అన్నం తినడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా వంట గదుల్లోనే ఆహారాన్ని వండి విద్యార్థులకు వడ్డించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి హెచ్ఎం రామాంజనేయులును వివరణ కోరగా వంటగదుల్లోనే ఆహార పదార్థాలు వండేలా చూస్తామన్నారు. బియ్యం కొత్తవి కావడంవల్ల అన్నం ముద్దగా అవుతోందన్నారు.



క్లాప్ కంపెనీ నిర్మించి ఇచ్చిన వంటగది

ఆలయ నిర్మాణానికి సహకరించండి



మంత్రి సవితను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

సోమందేపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీలో నిర్మించతలపెట్టిన శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి సహకరించాలని వేణుమాధవ వెల్ఫేర్ సంఘం నాయకులు మంత్రి సవితను కలిసి విన్నవించారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలపై చర్చించినట్లు అధ్యక్షుడు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గోపాల్‌యాదవ్, రాజగోపాల్, అమర్నాథ్, మైలార్, రామచంద్ర పాల్గొన్నారు.

గొప్ప కవి.. భక్త కనకదాస: చైర్మన్ రమేష్



కనకదాస చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

హిందూపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భక్త కనకదాస గొప్పకవి, జ్ఞాని అని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీకంఠపురం, గోళ్లాపురం గుడ్డంపల్లిలో భక్త కనకదాస జయంతిని నిర్వహించారు. కురుబ కులానికి చెందిన మహిళలు ప్రత్యేకంగా చేసిన జ్యోతులతో ఊరేగింపు చేశారు. ప్రత్యేకరథంలో కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమానికి చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే పీఏ బాలాజీ, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్‌కుమార్, పరిమళ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సమాజంలో మంచి ప్రభావం చూపిన కనకదాస ఆరాధనీయుడన్నారు. ఆయన నేర్పిన తత్వంతో మనమంతా పయనించాలన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, మంగేష్, రామాంజనేయులు, ఆనంద్, కదిరప్ప పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పాలసముద్రంలో రోడ్డుకు అడ్డంగా వాలిన వేపచెట్టు

గోరంట్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిందూపురం-కదిరి ప్రధాన రహదారిపై పాలసముద్రం గ్రామం వద్ద వేప చెట్టు రోడ్డుకు అడ్డంగా వాలడంతో ప్రమాదకరంగా మారింది. ఈ వేపచెట్టు ఏక్షణంలో అయినా కూలే ప్రమాదముంది. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈరహదారిపై చెట్టు పడితే ప్రమాదం జరిగే అవకాశముంది. దీనికితోడు శ్రీకృష్ణదేవరాల కాలం నాటి పురాతనమైన అభయాంజనేయస్వామి ఆలయం ప్రహరీ ఉంది. చెట్టు వల్ల ఆలయం దెబ్బతినే అవకాశముంది. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

దొమ్మర కులాన్ని దొరవంశీగా మార్పుపై హర్షం

రొళ్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దొమ్మర కులాన్ని దొరవంశీగా మార్చడం హర్షణీయమని యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. మండలంలోని దొమ్మరహట్టి గ్రామంలో మాజీ సీఎం ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు ఆయన క్షీరాభిషేకం చేశారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వీట్‌స్టాల్ నిర్వాహకుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వీట్ స్టాల్ నిర్వాహకుడు దస్తగిరి భార్య జమీలాభాను(65) అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం టీడీపీ నాయకులు కుటుంబాన్ని పరామర్శించారు. స్వీట్ స్టాల్ వ్యాపారి బాబాయ్య కోడలు ఊపిరి తిత్తుల సమస్యలతో కొంతకాలంగా చికిత్స పొందుతోంది. ఆమె ఆదివారం మృతిచెందడంతో మంత్రి సోదరుడు కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మల శ్రీధర్ దస్తగిరి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.